రేపు జాతీయ లోక్ అదాలత్

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 12: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, రాజీకి వీలున్న క్రిమినల్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చని వారు ఆ ప్రకటనలో తెలిపారు.

అధ్వాన దారులు ఎన్నాళ్లీ అవస్థలు..?

గుంతలు పడ్డ మాలపల్లి ప్రధాన రోడ్డు



కర్నూలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి)

ఆదోని - మంత్రాలయం వయా పెద్ద తుంబళం, మాధవరం ప్రధాన రహదారి మీద ప్రయాణం దుర్భరం. వర్షం వస్తే ఇక చెప్పనలవి కాదు. ఈ రోడ్డు మీద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదోని, అనంతపురం, బెంగళూరు, బళ్లారి నుంచి మంత్రాలయం, రాయచూరు వంటి ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డు చాలా కాలంగా ఇట్లాగే ఉంది. పెద్దకడబూరు మండలం పులికనుమ సమీపంలో రోడ్డు మధ్యలో మూడు నాలుగు అడుగుల గుంత పడింది. వర్షం వస్తే ఇది నీటితో నిండిపోతుంది. వాహనదారులు గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారని సమీప గ్రామస్తులు తెలిపారు. ఇక్కడ ఒక్కచోటే కాదు.. రహదారి పొడవునా ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో ప్రధాన రహదారులన్నీ ఇట్లాగే ఉన్నాయి. ఈ దుర్భర పరిస్థితికి గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. అయితే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అదే నిర్లక్ష్యం కనిపిస్తున్నది. వర్షకాలంలో కనీసం గుంతలు కూడా పూడ్చలేని దైన్య పరిస్థితి ఉంది. తక్షణ మరమ్మతులకు రూ.8 కోట్ల నిధులు కావాలని జూన్‌లో ప్రతిపాదనలు పంపినా ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తే. అయినా.. గుంతలు పూడ్చేందుకు కూడా నిధులు ఇవ్వకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

- అడుగడుగునా గుంతలు.. వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- గత ప్రభుత్వం నిర్లక్ష్యం సరే..టీడీపీ ప్రభుత్వంలోనూ అలసత్వం
- గుంతలు కూడా పూడ్చలేని దైన్యపరిస్థితి
- ఎమ్మెల్యేలు కళ్లకు గంతలు కట్టుకున్నారా? అనే విమర్శలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షణలో 3,150 కి.మీలు ప్రధాన రోడ్లు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 1,850 కిలోమీటర్ల పొడవు ప్రధాన రహదారులు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు రోడ్ల మరమ్మతులపై అంతులేని నిర్లక్ష్యం చూపింది. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడం, ఉమ్మడి జిల్లాకు చెందిన బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రోడ్లు భవనాలు శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో రహదారి కష్టాలు తీరుతాయని ఆశించారు. మూడు నెలలు కావస్తున్నా కనీసం మరమ్మతులకు కూడా ఒక్కపైసా ఇవ్వకపోవడం విమర్శలు వెల్లువెత్తున్నాయి. కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం.. సమస్త రహదారులు గుంతలమయం..! అన్నట్లుగా తయారయ్యాయి. కర్నూలు, ఆదోని డివిజన్ల పరిధిలో 725 కి.మీల తక్షణ మరమ్మతులకు రూ.8 కోట్లు అవసరమని రోడ్లు భవనాలు శాఖ ఎస్‌ఈ నాగరాజు జూన్ నెల చివర్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వారం పది రోజుల్లో నిధులు వస్తాయని ఇంజనీర్లు ఆశించారు. మూడు నెలలు గడిచిపోయాయి. గుంతలు పూడ్చేందుకు ఓ గంపెడు మట్టి కూడా వేయలేని దుర్భర పరిస్థితి ఉండడంతో వాహనదారులు పడుతున్న అవస్థలు ఎన్నో.



గుంతలు పడ్డ పెద్దకడబూరు మండలం పులికనుమ గ్రామం రోడ్డు



ఎమ్మిగనూరు - మాలపల్లి ప్రధాన రోడ్డు దుస్థితి

● కనీసం రూ.2 కోట్లు ఇవ్వమన్నాం

జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు గుంతలు పడి అధ్వానంగా మారాయి. వర్షాకాలంలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా మరమ్మతుల కోసం రూ.8 కోట్లు నిధులు ఇవ్వాలని జూన్‌లో ప్రతిపాదనలు పంపినా నిధులు ఇవ్వలేదు. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. తక్షణ మరమ్మతులకు కనీసం రూ.2 కోట్లు ఇవ్వాలని నివేదిక పంపాం. నిధులు రాగానే మరమ్మతులు చేపడుతాం.

- నాగరాజు, ఎస్‌ఈ, రోడ్లు భవనాలు శాఖ, కర్నూలు

● ఎమ్మెల్యేలు కళ్లకు గంతలు కట్టుకున్నారా..?

ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గం ప్రజలు జిల్లా కేంద్రం కర్నూలు రావాలంటే ఏకైక మార్గం ఎమ్మిగనూరు-కర్నూలు వయా కోడుమూరు రోడ్డే శరణ్యం. ఎమ్మిగనూరు-కోడుమూరు వయా గోనెగండ్ల మధ్యలో 33 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. అడుగుకో గంతల. అవస్థల ప్రయాణంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఎన్నో. ఎమ్మిగనూరు- మాలపల్లి రోడ్డు 15 కిలోమీటర్లు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి. వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కౌతాళం-కుప్పగల్లు రోడ్డులో పలు ప్రాంతాల్లో పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రానికి వెళ్లే భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఈ రోడ్లపై నిత్యం ప్రయాణించే ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారథి కళ్లకు గంతలు కట్టుకున్నారా..? రోడ్లలో గుంతలు కనిపించడం లేదా..? శాశ్వత మరమ్మతులు మాటేలా ఉన్నా.. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయించలేరా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి.. కనీసం రూ.2 కోట్లు ఇవ్వండి.. గుంతలను మట్టితోనైనా పూడ్చేస్తామని రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లు మొరపెట్టుకున్నా ఆలకించే నాథుడు కరువయ్యారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.



ఆదోని - రాయచూరు ప్రధాన రోడ్డులో మాలపల్లి వద్ద ఏర్పడిన భారీగా గుంత

కర్నూలు యార్డుకు భారీగా ఉల్లి

● క్వింటం గరిష్ఠ ధర రూ.3,659



కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన ఉల్లి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 12: కర్నూలు మార్కెట్ యార్డుకు గురువారం ఉల్లి భారీగా వచ్చింది. గురువారం మార్కెట్ యార్డులోని అన్ని ప్లాట్‌ఫారాల్లో ఉల్లి నిల్వలు పెద్ద ఎత్తున చేరాయి. 6,016 క్వింటాళ్ల ఉల్లిని రైతులు గోనెగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, డోన్, నందికొట్కూరు, పాణ్యం, ఎమ్మిగనూరు, తదితర మండలాల నుంచి తీసుకువచ్చారు. క్వింటా ఉల్లికి గరిష్ఠ ధర రూ.3,669, మధ్యస్థ ధర రూ.2,105, కనిష్ఠ ధర రూ.301గా నిర్ణయించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవింద్, అదనపు సెక్రటరీ వెంకటేశ్ తెలిపారు.

మంత్రాలయంలో లారెన్స్



మంచాలమ్మకు హారతులు ఇస్తున్న రాఘవ లారెన్స్, కుటుంబ సభ్యులు

మంత్రాలయం, సెప్టెంబరు 12: మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం ప్రముఖ సినీ నటుడు దర్శకుడు, డ్యాన్స్ మాస్టర్ రాఘవ లారెన్స్ కుటుంబ సమేతంగా వచ్చారు. గురువారం రాత్రి గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని అనంతరం రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మఠంలో ప్రదక్షిణలు చేసి కొంత సేపు ధ్యానం చేశారు. మఠం అధికారులు జయతీర్థ ఆచార్, బిందు మాధవ్ తదితరులు లారెన్స్‌కు స్వాగతం పలికారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు

- రూ.41.25 లక్షలు కేటాయింపు
- నగర పాలక కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 12: నగరంలో ఈనెల 15న జరిగే వినాయక నిమజ్జనానికి వినాయక ఘాట్ వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నగర పాలక కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిమజ్జనం రోజు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పర్యవేక్షించేందుకు వంద మందికి పైగా ప్రజారోగ్య ఇంజనీరింగ్ విభాగాలు అధికారులు, సచివాలయ సిబ్బందికి విధులు నిర్వహిస్తారన్నారు. పారిశుధ్య పనుల కోసం 270 మంది కార్మికులను నియమించామన్నారు. నిమజ్జనానికి రూ.41.25 లక్షలు ఖర్చు కేటాయించామన్నారు. అందులో రూ.10 లక్షలతో మైకులు, షామియానాలు, విద్యుద్దీపాలు, రూ.1.5 లక్షలతో 25 ప్రదేశాలలో సీసీ కెమెరాలు, రూ.లక్షతో కమాండ్ కంట్రోల్ రూమ్, గజ ఈతగాళ్ల కోసం రూ.1.75, రూ.15 లక్షలతో 8 క్రేన్లు, రూ.9 లక్షలతో పెయింటింగ్, రూ.3 లక్షలతో 12 ప్రదేశాలలో తాగునీటి సరఫరాకు నిధులు వెచ్చిస్తున్నామని తెలిపారు. 6 ఘాట్లలో నిమజ్జనం జరుగుతుందని, ప్రతి ఘాట్ వద్ద ఒక క్రేన్ ఉంటుందని, అదనంగా మరో 2 క్రేన్లు అందుబాటులో ఉంటాయన్నారు.

లోకాయుక్తపై విస్తృత ప్రచారం అవసరం

- చట్టాలపై ప్రజల్లో చైతన్యం రావాలి
- సమస్యల్లో 50 శాతం రెవెన్యూశాఖవే
- ఐదేళ్ల కాలంలో రూ.101 కోట్ల ప్రజాధనం రికవరీ
- లోకాయుక్త జస్టిస్ పి. లక్ష్మణరెడ్డి



కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 12: లోకాయుక్తపై ప్రజల్లో సరైన అవగాహన కొరవడిందని, దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించి, వారిని చైతన్యుల్ని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి అన్నారు. నగరంలోని సంతోష్‌నగర్‌లోని లోకాయుక్త కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జస్టిస్ లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ లోకాయుక్త అనేది న్యాయస్థానం కాదని, ఇది ప్రజా సమస్యల ఫిర్యాదులకు సంబంధించిన పరిష్కార వేదిక అని అన్నారు. అత్యంత తక్కువ ఖర్చుతో లోకాయుక్తలో బాధితులకు పరిష్కారం లభిస్తోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2011 సంవత్సరంలో లోకాయుక్త సవరణ చట్టంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని జస్టిస్ లక్ష్మణరెడ్డి అన్నారు. ప్రజాధనం వృథా, నిధుల దుర్వినియోగంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు విధుల్లో బాధ్యతరాహిత్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం తదితర అంశాలను సైతం తమ పరిధిలో పరిష్కారం చూపే వెసులుబాటు లభించిందన్నారు. ప్రజలు గతంలో మాదిరిగా ప్రత్యక్షంగానో, పోస్టు ద్వారానో సమస్యలను విన్నవించడమే కాక, వారి సౌలభ్యం కోసం నూతనంగా ఆన్‌లైన్‌లోనూ సమస్యలను నమోదు చేసే విధానం అమలులో ఉందని చెప్పారు. గతంలో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు మాత్రమే తమ దృష్టికి అధికంగా వచ్చేవని, ప్రస్తుతం పత్రికల్లో వచ్చిన కథనాలు, వార్తలను సైతం ఎక్కువగా సుమోటా తీసుకుని పరిష్కారం చూపినట్లు జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి తెలిపారు. తన ఐదేళ్ల పదవి కాలంలో మొత్తం రూ.101 కోట్లు ప్రజాధనాన్ని రికవరీ చేశామని, సమస్యల్లో 50 శాతం వరకు రెవెన్యూ శాఖకు సంబంధించి భూ వివాదాలే ఉంటున్నాయని చెప్పారు. 22(1)ఏ చట్టంతో ఈ సమస్యలు మరింత పెరిగాయని, దీని వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కోస్తా ప్రాంతంలో లోకాయుక్తపై కొంత అవగాహన ఉందని, రాయలసీమ ప్రజలను దీనిపై చైతన్యుల్ని చేసి లోకాయుక్త సేవలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ మధ్య కాలంలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఎక్కువయ్యాయని అన్నారు. తాడిపత్రిలో పెన్నానది ఆక్రమణకు గురై 1700 అక్రమ నిర్మాణలు వెలిశాయని, ప్రభుత్వ పాఠశాల సైతం ఇక్కడ నిర్మించటం విడ్డూరమని అన్నారు. పుట్టపర్తిలోని చిత్రావతి నదిలో ఇటువంటి పరిస్థితి చోటు చేసుకుందని, వీటిపై తమ పరిధిలో సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి తెలిపారు. చట్టాలపై ప్రజల్లో అవగాహన ఉండాలని సూచించారు. ఈనెల 14న తన పదవి విరమణ ఉంటుందని, ప్రజా ఫిర్యాదులకు సంబంధించి తదుపరి ఉప లోకాయుక్త బాధ్యతలు తీసుకుంటారని చెప్పారు. ఒక్క కర్నూలులోనే 1,321 ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో లోకాయుక్త రిజిస్ట్రార్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

డ్రాపౌట్లు లేకుండా చర్యలు తీసుకోవాలి

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి



సామూహిక సీమంతంలో పాల్గొన్న చైర్‌పర్సన్

కర్నూలు (కలెక్టరేట్), సెప్టెంబరు 12: విద్యార్థినులు మధ్యలో స్కూలు వదిలేయకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 7వ రాష్ట్రీయ పోషణ్ మాహ్-2024 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా చైర్‌పర్సన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నవ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టును 8 భాగాలుగా విభజించి గర్భిణులు, చిన్నారులలో రక్తహీనత, ఎదుగుదల లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత ఐసీడీఎస్ అధికారులపై ఉందన్నారు. పాఠశాలలను తనిఖీ చేస్తూ అనీమియాతో బాధపడుతున్న వారికి ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేయాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ అందించే పోషకాహారం, బాలామృతం కిట్లను పరిశీలించి, గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ సెక్రటరీ వసంతబాల, మహిళ, శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రోహిణి, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓడిన వ్యక్తి పెత్తనమేమిటి?

● వీరభద్రగౌడ్‌పై ఎమ్మెల్యే గుమ్మనూరు విమర్శలు



ఆలూరు, సెప్టెంబరు 12: అనంతపురం జిల్లా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం లేపుతున్నాయి. 'ఆలూరులో ఓడిన వ్యక్తి పెత్తనమేమిటి...' అంటూ టీడీపీ సీనియర్ నేత వీరభద్రగౌడ్‌ను ఉద్దేశించి గుమ్మనూరు జయరాం చేసిన విమర్శలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దేవరగట్టు ఆలయ హుండీ లెక్కింపు నేపథ్యంలో బుధవారం దేవరగట్టు ఆలయానికి వచ్చిన గుమ్మనూరు జయరాం తన అనుచరులతో రాజకీయంగా హాట్ కామెంట్స్ చేశారు. 'నేను టీడీపీలోనే ఉన్నాను కదా.. గెలిచిన ఎమ్మెల్యేను నేను. ఓడిపోయిన వ్యక్తి ఇన్‌చార్జి అంటూ పెత్తనం చేయడం ఏమిటి' అని వీరభద్రగౌడ్‌పై విమర్శలు చేశారు. త్వరలో ఆలూరు నియోజకవర్గంలో టీడీపీలోకి భారీగా చేరికలు ఉంటాయని కూడా ఆయన మాట్లాడారు. దీంతో ఆలూరు టీడీపీలో ఆధిపత్యం కోసం టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మధ్య వివాదం తారాస్థాయికి చేరిందని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



ఐదేళ్లుగా ఎదురుచూపులే!



శిరివెళ్ల, సెప్టెంబరు 12: వ్యవసాయంలో మొక్కలకు సూక్ష్మపోషకాలు బలాన్ని అందిస్తాయి. భూమిలో ఇతర పోషకాలు తగిన మొత్తంలో ఉన్నప్పటికీ.. సూక్ష్మ పోషకాలు, స్థూల మూలకాలు లోపిస్తే మొక్క పెరుగుదల ఆగిపోతుంది. దిగుబడి తగ్గిపోతుంది. దీనికి పరిష్కారంగా ప్రభుత్వం జిప్సమ్, బోరాన్, జింక్ తదితర సూక్ష్మపోషకాలను రాయితీపై అందిచాల్సి ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో సూక్ష్మపోషకాలపై రాయితీ దక్కలేదు. ఆర్బీకేల ద్వారా పంపిణీ చేయకపోవడంతో అధిక ధరలు వెచ్చించి రైతులు ప్రైవేటు దుకాణాల్లో కొని నష్టపోయారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం సూక్ష్మపోషకాలు పంపిణీ చేస్తుందని చిన్నకారు రైతులు ఆశ పెట్టుకున్నారు. అదనపు ఖర్చు లేకుండా పంట సాగు చేయవచ్చని అనుకుంటున్నారు.

- రాయితీ సూక్ష్మపోషకాల కోసం అన్నదాతల ఎదురు చూపు
- గత వైసీపీ ప్రభుత్వంలో పంపిణీకి తిలోదకాలు
- 33,441 మెట్రిక్ టన్నుల సూక్ష్మపోషకాలకు ప్రతిపాదనలు
- టీడీపీ ప్రభుత్వంపై సన్న, చిన్నకారు రైతుల ఆశలు



అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు

నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కేసీ కెనాల్, తెలుగుగంగ, హంద్రీనీవా తదితర కాల్వల సాగునీరు ప్రధాన వనరుగా రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు ఏటా ఖరీఫ్‌లో 6.5 లక్షల హెక్టార్లలో, రబీ సీజన్‌లో 3.4 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించుకుని వాటికి అనుగుణంగా సేంద్రియ, రసాయన ఎరువులను వినియోగించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇందులో ప్రధానంగా భూమిలో సూక్ష్మపోషకాల లోపం ఏర్పడితే పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన ఎరువుల ధరలు, తగ్గిన దిగుబడి ధరలతో రైతులకు వ్యవసాయం భారంగా మారింది. రైతులకు రాయితీపై ఎలాంటి పథకాలు అందించకపోవడంతో అప్పులపాలైన అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. గతంలో టీడీపీ హయాంలో రైతులకు భారం లేకుండా సూక్ష్మపోషకాలను యాభై నుంచి వంద శాతం రాయితీపై పంపిణీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ గ్రహణం వీడి టీడీపీ అధికారంలోకి రావడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. నేలకు, పంటకు జీవం పోసే సూక్ష్మపోషకాల పంపిణీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

సూక్ష్మపోషకాల ఆవశ్యకత :

- పంట పునరుత్పత్తి, అమైనో యాసిడ్ ఉత్పత్తి, సెల్ గోడ నిర్మాణంలో బోరాన్ తోడ్పడుతుంది. పిండి పదార్థాల రవాణా ద్వారా పంట నాణ్యతను మెరుగుపరచడంలో కీలకంగా పని చేస్తుంది. నేలలో బోరాన్ లోపిస్తే ఆకుల వైకల్యం, ఆకులపై ముదురు గోధుమ రంగు గుర్తులు ఏర్పడతాయి. ఆకులు పసుపు రంగులోకి మారతాయి. పంటల్లో పుష్పించే దశకు ముందు బోరాన్ వేయాల్సి ఉంటుంది.
- కిరణజన్య సంయోగక్రియ ప్రక్రియ, మొక్కల హార్మోన్లను సమతుల్యం చేయడంలో జింక్ దోహదపడుతుంది. ఎంజైమ్‌లను ఉత్ప్రేరణ చెందించడంలో సహాయపడుతుంది. నేలలో జింక్ లోపం వల్ల మొక్కల ఎదుగుదల మందగించడం, ఇంటర్నోడ్‌ల పొడవు తగ్గడం, చిన్న చిన్న ఆకులు ఏర్పడడం, దిగువ ఆకులపై పసుపు రంగు వస్తుంది.
- మొక్కల్లో మాంసకృత్తులు, కేంద్రకామ్లాలు, అమైనో ఆమ్లాల తయారీలో స్థూల మూలకమైన నత్రజని దోహదపడుతుంది. నేలలో నత్రజని లోపిస్తే మొక్కల్లో పెరుగుదల ఆగిపోతుంది. పత్రాలు సైతం పసుపు రంగులోకి మారుతాయి.

33,441 మెట్రిక్ టన్నులకు ప్రతిపాదనలు

నంద్యాల జిల్లా పరిధిలోని రైతులకు 33,441 మెట్రిక్ టన్నుల సూక్ష్మపోషకాల అవసరం ఉందని ఆయా మండలాల నుంచి సేకరించిన సమాచారాన్ని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఇందులో జింక్ 21 పర్సెంటేజ్ 6,100 మెట్రిక్ టన్నులు, 33 పర్సెంటేజ్ 23 మెట్రిక్ టన్నులు, 12 పర్సెంటేజ్ 30 మెట్రిక్ టన్నులు కావాలని ప్రతిపాదించారు. అలాగే జిప్సమ్ అత్యధికంగా 26,070 మెట్రిక్ టన్నులు, బోరాన్ 10.5 పర్సెంటేజ్ 107 మెట్రిక్ టన్నులు, 20 పర్సంటేజ్ 1,111 మెట్రిక్ టన్నులు కావాలని నివేదికలు పంపించారు. ప్రభుత్వం నుంచి సూక్ష్మపోషకాలు మంజూరైతే రాయితీపై రైతులకు పంపిణీ చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.



ప్రభుత్వం అమలు చేస్తే పంపిణీకి సిద్ధం



సూక్ష్మపోషకాలపై రాయితీని ప్రభుత్వం అమలు చేస్తే రైతులకు పంపిణీ చేస్తాం. రైతులకు అవసరమైన సూక్ష్మపోషకాల వివరాలను ఉన్నతాధికారులకు అందజేశాం. ప్రభుత్వం సూక్ష్మపోషకాలను ఆర్బీకేలకు సరఫరా చేస్తే నిబంధనలకు అనుగుణంగా వాటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్, వ్యవసాయాధికారి, శిరివెళ్ల



శ్రీశైలం జలాశయం జీవిత కాలాన్ని పెంచాలి

- సిద్దేశ్వరం అలుగు నిర్మాణంతోనే ఇది సాధ్యం..
- రాయలసీమ సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి
- నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై సమావేశం

నంద్యాల టౌన్, సెప్టెంబరు 12: రెండు తెలుగు రాష్ట్రాల నీటి అవసరాలకు శ్రీశైలం రిజర్వాయర్ అత్యంత కీలకమని, అది ఇప్పటికే చాలా పూడిపోయిందని, 50 లక్షల ఎకరాల సాగునీటి అవసరాలు తీర్చాలంటే శ్రీశైలం జలాశయం జీవితం కాలం పెంచాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. గురువారం నంద్యాలలో సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు - సమస్యలు - నీటి హక్కులపై సమావేశాన్ని నిర్వహించారు. రాయలసీమలోని 8 జిల్లాల నుంచి ప్రజాసంఘాల నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బొజ్జా దశరథరామిరెడ్డి వివరిస్తూ.. శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద ఇన్‌ఫ్లో ప్రారంభమై రెండు నెలలు అయిందని, పూర్తి స్థాయి నీటి సామర్థ్యంతో 50 రోజుల నుంచి ఉన్నప్పటికీ రాయలసీమలో ఉన్న రిజర్వాయర్లన్నీ వెల వెల బోతున్నాయని పేర్కొన్నారు. శ్రీశైలం నిండు కుండలా ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడు నుంచి ప్రతి రోజు 4 టీఎంసీలు, తద్వారా 50 రోజుల్లో 200 టీఎంసీలు తీసుకొనే అవకాశం ఉండిందని అన్నారు. మల్యాల ఎత్తిపోతల ద్వారా 4 రోజులకు ఒక టీఎంసీ లాగా ఈ 50 రోజుల్లో 12 టీఎంసీలు తీసుకొని ఉండాలని అన్నారు. ఈ రెండు మార్గాల ద్వారా దాదాపు 210 టీఎంసీల నీరు పొందాల్సి ఉండగా రిజర్వాయర్ల నిర్వహణ లోపంతో, ప్రధాన కాల్వ లోపంతో కేవలం 85 టీఎంసీలను మాత్రమే రాయలసీమ జలాశయాల్లో నిల్వ చేశారని అన్నారు. ఏపీలో 42 శాతం భూభాగం రాయలసీమ ఉన్నప్పటికీ గత 10 ఏళ్ళుగా రాష్ట్ర బడ్జెట్‌లో సీమకు కేవలం 15 శాతం నిధులు కేటాయించడం వల్లనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు శిథిలావస్థకు చేరాయని అన్నారు.

సమగ్రమైన చర్చ జరగాలి :

కృష్ణా డెల్టాకు కేటాయించిన 101 టీఎంసీల నీటిని నాగార్జున సాగర్ - ప్రకాశం బ్యారేజ్ మధ్య తెలంగాణా నుంచి ప్రవహించే మూసీ, పాలేరు, మున్నేరు తదితర నదుల నుంచి పొందే హక్కును బచావత్ ట్రిబ్యూనల్ ఇచ్చిందని, అయితే ఈ నీటిలో కేవలం 20 టీఎంసీల నీటిని పొందే అవకాశం ఉందని, మిగిలిన నీటిని నాగార్జున సాగర్ ద్వారా లేదా శ్రీశైలం నుంచి పొందేలా 2015 జూన్ 18, 19వ తేదీల్లో జరిగిన కృష్ణానది యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఇందులో అప్పటి ఏపీ ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరించిందని అన్నారు. కృష్ణా డెల్టాకు కేటాయించిన నీటిని సముద్రంలోకి పారబోస్తూ ఇటు రాయలసీమ, అటు నాగార్జున సాగర్ వాడుకోవాల్సిన నీటిని డెల్టా తీసుకొనేలా అప్పటి సమావేశంలో తీర్మానం చేయడం దారుణమని అన్నారు. కృష్ణా డెల్టాకు నాగార్జున సాగర్ దిగువన లభించే కృష్ణా జలాలను వినియోగించుకోకపోతే పోలవరం నిర్మాణం జరిగినా రాయలసీమకు జరిగే మేలు ఏమీ ఉండదని ఆయన అన్నారు. ఈ విషయాలపై సమగ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందని బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి



సీఎం చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, పక్కన మంత్రి టీజీ భరత్, తిక్కారెడ్డి తదితరులు

పత్తికొండ నుంచి రూ. 22 లక్షల విరాళం

- ముఖ్యమంత్రికి చెక్కును అందించిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ. 22 లక్షలు బుధవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. మంత్రి టీజీ భరత్, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి విజయవాడ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. దీంతోపాటు రూ.7.5 లక్షల విలువైన వెయ్యి నిత్యావసర వస్తువుల కిట్లను విజయవాడ భవానినగర్ ప్రాంతంలో ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నేరుగా అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర నాయకులు నాగేశ్వరయాదవ్, సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కర్ణాటక జలచౌర్యాన్ని అడ్డుకోవాలి

- ఎస్ఈకి సీపీఎం వినతి



ఎస్ఈకి వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 12: కర్ణాటక జలచౌర్యాన్ని అడ్డుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం జలవనరుల శాఖ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ తుంగభద్ర జలాశయంలో నీటి వాటాను కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నీటి హక్కును సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ఏపీలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రైతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ముఖ్యంగా కరువుపీడిత ప్రాంతమైన రాయలసీమకు న్యాయం జరిపించేందుకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులకు వ్యతిరేకంగా తాజాగా తుంగభద్ర నదిపై రెండు చోట్ల బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించాలని ప్రతిపాదనలు చేయడం తీవ్ర అన్యాయమని, వెంటనే ఈ ప్రతిపాదనను ఆ ప్రభుత్వం విరమించుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తుంగభద్ర నదిపై అక్రమంగా కర్ణాటక ప్రభుత్వం బ్యారేజీలు, ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయడం వల్ల కర్నూలు జిల్లాలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందక పంటలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. సుంకేసుల జలాశయం ఎగువన తుమ్మిళ్ల వద్ద తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ఎత్తిపోతల పథకంతో పాటు ఆర్డీఎస్ వద్ద ఆ ప్రభుత్వం నీటి మళ్లింపునకు తీసుకుంటున్న చర్యల వల్ల కేసీ కెనాల్ ఆయకట్టుకు నీరు అందించలేని పరిస్థితి నెలకొంటుందని, ఈ అక్రమాలను వెంటనే ప్రతిఘటించేందుకు సీఎం చర్యలు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, కేవీ నారాయణ తదితరులు ఉన్నారు.

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి



గిడ్డయ్య (ఫైల్)

ఆదోని, సెప్టెంబరు 12: ఆదోని పట్టణంలోని కల్లుబావి కాలనీకి చెందిన గిడ్డయ్య (55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కల్లుబావి కాలనీకి చెందిన గిడ్డయ్య అనే వ్యక్తి గురువారం ఉదయం బహర్భూమికి వెళ్లి ఇంటికి వెళుతుండగా ఆలూరు వైపు నుంచి వచ్చిన ట్యాంకర్ వెనకవైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గిడ్డయ్య అక్కడికక్కడే మృతి చెదారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గిడ్డయ్యకు భార్య సరోజమ్మ, నలుగురు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

కోసిగి, సెప్టెంబరు 12: రెండు రోజుల క్రితం కోసిగి వైసీపీ నాయకురాలు, మాజీ జడ్పీటీసీ దలవాయి మంగమ్మను అదే పార్టీకి చెందిన నాయకుడు కురువ మల్లయ్య కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మల్లయ్యను గురువారం అరెస్టు చేసి హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పత్తికొండ సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు. ప్రస్తుతం మంగమ్మ ఆదోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

హాలహర్వి, సెప్టెంబరు 12: మండలంలోని చింతకుంట గ్రామంలో అర్జున్(16) అనే బాలుడు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఇంటి మిద్దెపై కలుపు మొక్కలను తొలగిస్తుండగా విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్ర తెలిపారు.

కుందూలో ఇద్దరు గల్లంతు



గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసు సిబ్బంది



రామసుబ్బారెడ్డి (ఫైల్)



బాలగురప్ప(ఫైల్)

కోవెలకుంట్ల, సెప్టెంబరు 12 : కోవెలకుంట్ల మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన బాలగురప్ప (44) అనే వ్యక్తి ఇటీవల మృతి చెందిన తన సమీప బంధువు కర్మకాండ నిర్వహించేందుకు గురువారం కుందూనది వద్దుకు చేరుకున్నాడు. ఆ కార్యక్రమం అనంతరం స్నానం చేసేందుకు నదిలోకి దిగి నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. దీంతో బంధువులు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యారు. పోలీసులకు సమాచారం ఇచ్చి గజ ఈతగాళ్లను రప్పించినా ఫలితం లేకపోయింది. మరో వైపు ఇదే గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి (60) అనే వృద్ధుడు గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలన్న ఉద్దేశంతో గురువారం కుందూలోకి దూకాడు. స్థానికులు రక్షించే యత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఒకే రోజు ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కుందూలో విగత జీవులు కావడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. రేవనూరు ఎస్ఐ భూపాలుడు పోలీసు సిబ్బంది, రెవెన్యూతో కలిసి గజ ఈతగాళ్ల సాయంతో కుందూలో గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నాగార్జునరెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అయితే ఒకే రోజు ఇద్దరు గల్లంతు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యారేజీపై బోట్ల దాడిలో కుట్ర లేదా...?

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 12: ప్రకాశం బ్యారేజీని కూల్చేందుకు మాజీ సీఎం జగన్ కుట్ర చేసినట్లు...స్పష్టంగా ఆధారాలు కనిపిస్తున్నాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరదల వల్ల విజయవాడ నగరం అతలాకుతలమై ఉంటే వైసీపీ బురద రాజకీయాలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 11 రోజులు పాటు రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సౌకర్యాలను సమకూరుస్తుంటే జగన్ రెడ్డి బురద రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. 80 టన్నుల పైగా బరువు ఉన్న మూడు బోట్లతో బ్యారేజీని ధ్వంసం చేయడం వైసీపీ కుట్ర పన్నలేదా? అని ప్రశ్నించారు. ఈ సంఘటనపై విచారణ వేగవంతం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాతో ఏచూరి

- 1975 ఎమర్జెన్సీలో కర్నూలులో సీతారాం



ఎస్టీబీసీ మైదానంలో ఎన్ఆర్‌సీ, సీఏఏ, ఎన్‌పీఆర్‌లకు వ్యతిరేకంగా జరిగిన సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి(ఫైల్)

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు కర్నూలు జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. 1975 సంవత్సరంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధి విధించిన ఎమర్జెన్సీ సమయంలో కర్నూలు మెడికల్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులతో కలిసి సీతారాం ఏచూరి ఇక్కడే తలదాచుకున్నట్లు సమాచారం. 2004 ఎన్నికల్లో కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. 2013 సుందరయ్య శతజయంతి ఉత్సవాల సందర్భంగా సుందరయ్య భవన్‌లో సుందరయ్య విగ్రహావిష్కరణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ట్రస్టు ఏర్పాటుకు పునాది వేసింది ఏచూరినే. 2019 డిసెంబరులో ఎన్‌సీఆర్, ఎన్‌పీఆర్‌కి వ్యతిరేకంగా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్వర్యంలో ఉస్మానియా కళాశాలో మైదానంలో జరిగిన బహిరంగ సభలో ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించారు.

కొనసాగుతున్న గణేశ్ ఉత్సవాలు



కుమ్మరివీధిలో కొలువుదీరిన వినాయకుడు

వినాయక చవితి సందర్భంగా కొలువుదీరిన వినాయక విగ్రహాలు ఆరో రోజు గురువారం ప్రత్యేక పూజలందుకున్నాయి. వినాయక మండపాల్లో బొజ్జ గణపయ్యలకు భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టగా మరికొన్ని ప్రాంతాల్లో అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. నగరంలోని బుధవారపేట, షరీన్‌నగర్, గాయత్రి ఎస్టేట్, సుంకేసుల రోడ్డులోని గాంధీటవర్స్ అపార్టుమెంట్, చిదంబరరావు వీధి, కలెక్టరేట్‌లో, వెంకటరమణ కాలనీ, వన్‌టౌన్‌లోని చిత్తారివీధి, చిదంబరరావు వీధి తదితర ప్రాంతాల్లో గణేశ్ ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

- కర్నూలు, కల్చరల్



బుధవారపేటలో..



సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో..



చిదంబరరావు వీధిలో..



పూలబజార్‌లో..

మాతృ మరణాలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 12: జిల్లాలో జూన్, జూలై నెలల్లో జరిగిన 8 మాతృమరణాలపై డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ సమీక్ష నిర్వహించారు. గురువారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో డీఎంహెచ్‌వో ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, కర్నూలు జీజీహెచ్ డాక్టర్లు సుధారాణి, వెంకటనారాయణ, సుప్రియ, ఆదోని ఎంసీ హెచ్ నుంచి మాధవీలత, మమత, విజయ భారతి, అనస్థీషియా ప్రొఫెసర్ సుధీర్‌లతో సమీక్ష నిర్వహించారు. మాతృ మరణాలన్నీ కాన్పుకు ముందు, తర్వాత జరిగినవిగా నిర్ధారించారు. ప్రసవం సమయంలో బీపీ, ఫిట్స్ రావడం వల్ల పల్మనరీ థాంబో లైసిస్‌తో 8 కేసులు చనిపోయినట్లు కమిటీలో నిర్ధారించారు. క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, ఎంఎ ల్‌హెచ్‌పీలు గర్భవతులను 12 వారాలలోపు గుర్తించాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. సమీక్షలో డీఐవో డాక్టర్లు నాగప్రసాద్, ఉమా, పీహెచ్‌సీ ప్రైవేటు డాక్టర్లు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడం అభినందనీయం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 12: వరద బాధితులకు అండగా మంత్రి, ఎమ్మెల్యేలు, నాయకులు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. గురువారం రెండో రోజు విజయవాడలోని విద్యాధరపురం, ఆర్టీసీ డిపో పక్కన, సితార సెంటర్ ప్రాంతాల్లో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండి రాకేష్, డుండీ గణేశ్ సేవాసమితి ఆధ్వర్యంలో మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో కలిసి వరద బాధితులకు కిట్లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, ఇన్‌చార్జిలు వీరభద్రగౌడ్, ఉమాపతి నాయుడు, వై.నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల నాగేంద్ర, ఎల్‌వీ ప్రసాద్, పేరపోగు రాజు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 12: ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు విరాళాలు సేకరించారు. గురువారం నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో విద్యార్థుల నుంచి రూ.17,200 సేకరించినట్లు డీవైఎఫ్ఐ జల్లా కార్యదర్శి నగేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, నాయ కులు హుస్సేన్‌బాషా, అమర్, మనోహర్, చింటూ పాల్గొన్నారు.

● విజయవాడ వరద బాధితుల కోసం రూ.55 వేలు విరాళాలు సేకరించినట్లు సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి తెలిపారు. రెండు రోజులుపాటు నగరంలోని ప్రధాన వీధుల్లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, మహిళా సమాఖ్య, రైతు సంఘం నాయకులు, కార్యక ర్తలు తిరిగి విరాళాలు సేకరించారని ఆయన తెలిపారు.

టైం స్కేల్ అమలు చేయాలి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 12: బోధన, బోధనేతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులు కృష్ణవేణి, కిరణ్‌మై, బాబు మాట్లాడుతూ ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి టైం స్కేల్ వర్తింప చేయాలని, జీతాలు పెంచాలని ఎన్నో సార్లు అధికారులను విన్నవించామన్నారు.

'గ్రావెల్ అక్రమ తవ్వకాలపై నోటీసులు ఇస్తాం'

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 12: గ్రావెల్ అక్రమ తవ్వకాలపై గనుల శాఖ సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం ఓర్వకల్లు మండలం పరిధిలోని కాల్వ గ్రామంలో తవ్వకాలు జరిపిన వ్యక్తుల నుంచి వివరాలు సేకరించామని తెలిపారు. గ్రీన్‌కో కంపెనీ, పుట్టగొడుగుల కంపెనీలకు నోటీసులు ఇచ్చి తరలించిన గ్రావెల్‌కు సంబంధించి క్యూబిక్ మీటర్ల లెక్కన జరిమాన వసూలు చేస్తామని తెలిపారు. అలాగే ఏపీఐఐసీలో రోడ్డు కోసం తరలించిన గ్రావెల్‌కు కూడా సంబంధింత విభాగం నుంచి రికవరీ చేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో రెండు టిప్పర్లను సీజ్ చేసి ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ తరలించామని చెప్పారు. విజిలెన్స్ విభాగం సర్వేయర్ మురహరి, గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు సువర్ణ అవకాశం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 12: రాయలసీమ యూనివర్సిటీలో 2015 నుంచి చదివిన డిగ్రీ విద్యార్థులకు అధికారులు సువర్ణ అవకాశం కల్పించారని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కో కన్వీనర్ మౌలాలి అన్నారు. గురువారం వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015 నుంచి డిగ్రీ చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు వన్‌టైమ్ చాన్స్ స్పెషల్ సప్లిమెంటరీ నిర్వహిస్తున్నారన్నారు. 9 ఏళ్ల క్రితం డిగ్రీ సెమిస్టర్ విధానం ప్రారం భమైందని, తదనంతరం అనేక మంది విద్యార్థులు తమ బ్యాక్ లాగ్ సమస్యను పరి ష్కరించాలని గతంలో ఉన్న వీసీలకు అనేక సార్లు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కోరామని కాని స్పందించలేదని, ప్రస్తుత ఉపకులపతి విద్యార్థుల సుదీర్ఘ సమస్యను పరిష్కరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ నాయకులు రాజు, గణేష్, రాజేష్, అమర్, సాయి, శివ, ప్రసాద్, శరత్, భీమేష్, ప్రవీణ్, జీవన్ పాల్గొన్నారు.

నగదు వసూలు చేస్తే చర్యలు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13: ఆరోగ్యశ్రీ కింద పేషెంట్ల నుంచి నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆసుపత్రి యజమాన్యాలను హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమా వేశం మందిరంలో ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల యజమాన్యాలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం అనేది నగదు రహితంగా నిర్వహించే పథకం అని, అందులో నగదు తీసుకోవడం ఏంటనీ ప్రైవేటు ఆసుపత్రుల యజమాన్యాలను ప్రశ్నించారు. ఆసుపత్రులపై వస్తున్న ఫిర్యాదులకు సంబంధించి డీఎంహెచ్‌వో, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ నెలలో ఒకసారి సబ్ కమిటీ స్థాయి సమావేశం నిర్వహించు కుని ఫిర్యాదులపై వివరణ తీసుకోవాలన్నారు. సదరు కమిటీ వివరణకు సంతృప్తి చెందకపోతే ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే జిల్లా స్థాయి కమిటీలో ఫిర్యాదును పరిశీలిస్తామన్నారు. జిల్లాలో వివిధ ఆసుపత్రులకు సంబంధించి ఇప్పటి వరకు 174 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈసమా వేశంలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా.ఎంవీఎస్ఎస్వీ భాస్కర్ రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్ ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డా.రామకృష్ణ, ప్రైవేటు ఆసుపత్రుల యజమాన్యాలు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

సి.బెళగల్, సెప్టెంబరు 12: మండలంలోని ఈర్లదిన్నె, శింగవరం, కొత్తకోట గ్రామాల్లోని ఇసుక రీచ్‌లను తహసీల్దార్ విజయశ్రీ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ఇసుక రీచ్‌ల నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఇసుక కావాలనునేవారు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల దగ్గర క్యూలో ఉండి ఇసుక కూపన్ తీసుకోవాలన్నారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, వీఆర్వోలు ఉన్నారు.

వినాయకుడికి ప్రజాప్రతినిధుల పూజలు





వినాయకుడికి పూజలు చేస్తున్న ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 12: జోహరాపురం రోడ్డులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్ వద్ద వరసిద్ధి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఎంపీ బస్తిపాటి నాగ రాజు గురువారం సందర్శించి పూజలు చేశారు. ఎంపీ మాట్లాడుతూ రైతులు, ప్రజలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, భక్తి శ్రద్ధలంతో 9 రోజులు కార్యక్రమాలు చేస్తున్న కమిటీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం మహిళా అధ్యక్షురాలు పి.శ్రీలీల, జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, నాయకులు కేసీ నాగన్న, మద్దిలేటి, వినాయక భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని బిర్లాగేట్, పోస్టఆఫీస్, ముజఫర్‌నగర్, కల్లూరు, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీల్లో వినాయక విగ్రహాలను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సందర్శించారు. గురువారం ఆయా కాలనీ భక్తబృందం ఏర్పాటు చేసిన విగ్రహాలకు గౌరు చరిత పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కర్నూలు మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం నేత ఏచూరి మృతి బాధాకరం

మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి బాధాకరమని, దేశం ఓ గొప్ప నాయకుడిని కోల్పోయిందని బీజేపీ నేత, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీతారం ఏచూరితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తమ పార్టీ సిద్ధాంతాలను గౌరవించుకుంటూనే ప్రతి ఒక్కరితో కలుపుగోలుగా ఉంటూ స్నేహపూర్వకంగా ఉండే వ్యక్తి సీతారాం ఏచూరి అన్నారు. రాజ్యసభలో తన సహచర ఎంపీగా సీతారం ఏచూరి తన గళాన్ని వినిపించారన్నారు. ఆయన మృతి తనను ఎంతో బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

కర్నూలు(లీగల్): సీపీఎం జాతీయ నాయకుడు సీతారాం ఏచూరి మృతికి బార్ అసోసియేషన్ గురువారం ఒక ప్రకటనలో తమ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఈసందర్భంగా అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఆయన పార్లమెంటులో తన గళాన్ని వినిపిం చేవారని, ఆయన మృతి సీపీఎంకి తీరని లోటని అన్నారు.

కర్నూలు(న్యూసిటీ): సీతారాం ఏచూరి మృతికి సీపీఐ జిల్లా సమితి సంతాపం ప్రకటిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎం పార్టీ పోలూట్ బ్యూరో సభ్యుడిగా ఆయన సేవలు మరువలేనివన్నారు. రాజ్యసభలో బిల్లులు ప్రవేశపెట్టిన సమయంలో ప్రజల తరపున అనర్గళంగా మాట్లాడే సత్తా ఉన్న వ్యక్తి అని కొనియాడారు.

● సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. గురువారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ నారాయణ, అధ్యక్షతన సుందరయ్య భవన్‌లో సీతారాం ఏచూరి సంతాప సభను ఏర్పాటు చేశారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు పి.నిర్మల, నగర కార్యదర్శి రాముడు, రాజశేఖర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● సీతారాం ఏచూరి మృతికి సీపీఎం, అనుబంధ సంఘాలు పలువురు సంతాపం ప్రకటించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీఎస్.రాధాక్రిష్ణ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పలువురు తెలిపారు.

● సీతారాం ఏచూరి మరణం విషాదకరమని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనారోగ్యంతో ఆయన కన్ను మూయడం చాలా బాధాకరమన్నారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 12: డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల హ్యాండ్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. బాలుర విభాగంలో సెయింట్ జోసెఫ్, బాలికల విభాగంలో డోన్ కేజీబీవీ జట్లు విజేతలుగా నిలిచాయి. ముఖ్యఅతిథిగా న్యాయవాది జి.శ్రీధర్‌రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీలను, పతకాలను అందజేసి అభినందించారు. బాలుర విభాగంలో సెయింట్ జోసెఫ్ జట్టు మొదటి గుళ్యం జడ్పీహెచ్ఎస్, ద్వితీయ స్థానాలు సాధించగా.. తృతీయ సంయుక్త విజేతలుగా ఆదర్శ విద్యామందిర్, పంచలింగాల మాంటిసోరి జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో విన్నర్స్‌గా డోన్ కేజీబీవీ, పంచలింగాల మాంటిస్సోరి జట్లు రన్నర్‌గా నిలువగా.. తృతీయ సంయుక్త విజేతలుగా గూళ్యం జడ్పీహెచ్ఎస్, కంబలపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జట్లు నిలిచాయి.

వార్డుల్లో మెరుగైన సేవలు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 12: గైనిక్, చిన్న పిల్లల విభాగంలో ఉన్న రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ సి.ప్రభా కర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాల్లో రౌండ్స్ నిర్వహించారు. గైనిక్ విభాగంలోని వాటర్ ట్యాప్స్‌ల మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. డీఆర్‌వన్‌లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్స్‌పై ఆయన ఆరా తీశారు. ఫ్యాన్లు లేని చోట కొత్తగా వచ్చిన ఫ్యాన్లు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డాక్టరు బీవీ రావు డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవో హేమనళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ కిరణ్ కుమార్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

కల్లూరు, సెప్టెంబరు 12: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలను గడించవచ్చని కల్లూరు మండల ప్రకృతి వ్యవసాయ అధికారి షేక్ మాబూవలి అన్నారు. గురువారం కల్లూరు మండలం కొంగనపాడు గ్రామంలో రైతు రామకృష్ణారెడ్డి ఇంటివద్ద ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధి కారి తిరుమలేషు, రైతులు లక్ష్మన్న, రామకృష్ణ, కేశన్న పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 12: అన్ని దానాల్లో అన్నదానం ఎంతో గొప్పదని నగర కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. గురువారం నగర పాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టివినాయకుడి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించి ఉద్యోగులకు వడ్డించారు. మేనేజర్ చిన్నరాముడు, సీనియర్ అసిస్టెంట్లు రామక్రిష్ణ, జీఎం.శ్రీకాంత్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు కూల్చివేత

ఓర్వకల్లు, సెప్టెంబరు 12: ఓర్వకల్లులో 'ప్రమాదకరంగా నీటి ట్యాంకు' అనే శీర్షికను జూలై 31న ఆంధ్రజ్యోతిలో ప్రచురింతమైంది. స్పందించిన అధికారులు గురువారం వాటర్ ట్యాంకును ఎక్సవేటర్‌తో కూల్చివేశారు. టీడీపీ గ్రామ నాయకులు గోవిందరెడ్డి, రాం భూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి పర్యవేక్షణలో ట్యాంకు చుట్టు ఉన్న కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కూల్చివేశారు.

ఉల్లి రైతును ఆదుకోండి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 12: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు విక్రయానికి తెచ్చిన ఉల్లిని రామకృష్ణ పరిశీలించారు. నష్టపోయిన రైతులతో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో ఉల్లి రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, వెంటనే రైతులకు రాయితీ మొత్తాన్ని అందించాలని కోరారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

ఓర్వకల్లు, సెప్టెంబరు 12: విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ సూచించారు. గురువారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో శ్రీవాణి విద్యానికేతన్, జడ్పీ ఉన్నత పాఠశాల, శాంతమ్మ స్కూల్, లొద్దిపల్లె గ్రామంలోని బీసీ హాస్టల్‌లను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యా యుల హాజరు, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థుల పరీక్షలను, అన్ని అంశాలను సమీక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం సందర్శన

కల్లూరు, సెప్టెంబరు 12: జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల అధికా రులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. అనంతరం ఆయన కార్యాలయంలో వినియోగదారులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. జిల్లా దస్తావేజు లేకర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చందు ఎంపీని కలిసి వినియోగదారుల సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో జనసేన కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అర్షద్, దస్తావేజు లేకర్లు హనుమం తరావు, నాగేశ్వరరావు, యూసఫ్, రామకృష్ణ, ముస్తాక్, గోపాల్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 12: జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య చికిత్సలు అందించాలని పీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అయ్యన్న, కార్యదర్శి సురేష్ కోరారు. గురువారం స్థానిక వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏవో అరుణను కలిసి విద్యార్థి సంఘం నాయకులు వినతి పత్రం అంద జేశారు. గత కొంత కాలంగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని అన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ వసతి గృహాల్లో ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని కోరారు.

నూతన వాటర్ షెడ్ కమిటీ ఎన్నిక

ఓర్వకల్లు, సెప్టెంబరు 12: మండలంలోని గుట్టపాడు గ్రామంలో వాటర్‌షెడ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ నర్ల మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు. వాటర్‌షెడ్ ఇంజనీర్ ఎస్ఎండీ అయూబ్ సోషల్ ఆర్గనైజర్ షేక్ మహ్మద్, పీవో ఎస్ఎండీ వలి ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా పెద్దస్వామిరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా మలాన్‌బీ, సెక్రటరీగా రాధాకృష్ణుడు, మెంబర్లుగా ఆదిరీయా, మహబూబ్‌బీ, మౌలాలి, మాల రాజశేఖర్, లక్ష్మీదేవి, మహబూబ్ బాషా, పెద్ద నరసింహుడు, ఎస్ఎండీ వలిలను ఎన్నుకున్నారు.

'పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలి'

సి.బెళగల్, సెప్టెంబరు 12: పండ్ల తోటలతో అధిక లాబాలు సాధించవచ్చునని, సాగుపై దృష్టి సారించాలని కోడుమూరు ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌గౌడు సూచించారు. గురువారం మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, ఇనగండ్ల గ్రామాల్లోని పండ్ల తోటలను ఆయన పరిశీలించారు.

చంద్రబాబును కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే



చంద్రబాబుతో కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 12: అమరావతిలో వెలగపూడి సచివాల యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని గురువారం రాష్ట్ర మంత్రి టీజీ భరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. కోడుమూరు నియోజకవర్గం నుంచి విజయవాడలో వరద బాధితులకు తన వంతు సాయంగా 500 నిత్యావసర కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేసిన విష యం తెలిసిందే. ఈనేపథ్యంలో జిల్లా టీడీపీ నాయకులంతా చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌లను కూడా కోడుమూరు ఎమ్మెల్యే కలిశారు.

సెక్యూరిటీ గార్డుల ఆందోళన



ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 12: బకాయిపడ్డ మూడు నెలల వేత నాలు చెల్లించాలంటూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ గార్డులు గురువారం ఆందోళన చేశారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ రావాల్సి ఉందని, సీఎస్‌వో సమాధానం చెప్పడంతో సెక్యూరిటీ గార్డులు విధులు బహిష్కరించి న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డులు మాట్లాడుతూ సెక్యూరిటీ ఏజెన్సీ ఎండీ 6 నెలలకు ఒక్కసారి జీతాలు పెంచుతానన్న హామీ అమలు కాలేదన్నారు. అనంతరం ఆసుపత్రి సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బీవీ రావు, ఏడీ రమేష్‌బాబు ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ గార్డులతో మాట్లాడి వేతనాలు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12: ఈ నెల 15న జరిగే గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులతో జాయింట్ కలెక్టర్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జనం సజావుగా జరిగేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ నెల 14న ఉదయంలోపు బ్యారి కేడింగ్ పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఓల్డ్ బస్టాండు నుంచి వినాయక ఘాట్ ప్రాంతం వరకు అక్కడక్కడ బేసిక్ ఫస్ట్ ఎయిడ్‌తో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని 108తో పాటు 2 అంబులెన్సులు ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యశాఖకు సంబంధించి గజ ఈతగాళ్లను, లైఫ్ జాకెట్లను ఘాట్ వద్ద ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖను ఆదేశించారు. అదేవిధంగా ఫైర్ ఇంజన్లను సిద్ధంగా ఉంచాలని ఫైర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, ఆర్డీవో శేషిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు వేణు గోపాల్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సభ్యులు జి.వెంకటేశ్, తిమ్మన్న, సుధాకర్, శ్రీనివాసరెడ్డి, మోక్షేశ్వరుడు పాల్గొన్నారు.

'స్వచ్ఛతాహీ సేవా' ప్రణాళికను సిద్ధం చేయాలి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13: ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి సంబంధించి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై గ్రామాల్లో ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జేసీ డా.బి.నవ్య, జడ్పీ సీఈవో, డీపీవో, డీఈవో సం బంధిత అధికారులు పాల్గొన్నారు.

కర్నూలు(కల్చరల్): ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేయాలని నగర పాలక కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర పాలక కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్ వైజర్ నాగరాజు, డీఈఈ నరేష్, టీపీఆర్‌వో వెంకటలక్ష్మి, ఏఈలు దినేష్, భాను పాల్గొన్నారు.

'విద్యార్థులు బాగా చదువుకోవాలి'

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 12: విద్యార్థులు బాగా చదువుకోవాలని క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం క్లస్టర్ వర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో 2024-25 విద్యార్థులకు దీక్షారంభం కార్యక్రమం ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కళాశాల్లో అందుబాటులోకి వచ్చిన నూతన కోర్సుల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపకులపతి

రహదారుణాలు

గోనెగండ్ల, హొళగుంద మండలాల రహదారుల దుస్థితి



పెద్దనేలటూరు, బురాన్‌దొడ్డి రహదారి

గోనెగండ్ల/హొళగుంద, సెప్టెంబరు 12: గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు-బురాన్‌దొడ్డి గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. అసలు ఇక్కడ రహదారి ఉందా? లేదా అన్న అనుమానం కలుగుతుంది. ముళ్ల కంపతో నిండి పోయి కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా పోయిందని రైతులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు వెళ్లాలంటే ఈ దారే గతి. వర్షం కురిసిందంటే ఎడ్లబండ్లు బురదలో ఇరుక్కుపోయే అవకాశముంది. అధికారులు సీసీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

హొళగుంద మండలంలో...

అలాగే హొళగుంద మండలం పెద్ద గోనెహాల్ గ్రామంలోని రహదారులన్నీ బురదతో నిండిఉన్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వర్షం కురిసిందంటే చాలు నీరంతా రహదారిపై నిలువ వుంటోంది. గ్రామంలో డ్రైనేజీ లేకపోవడంతో వర్షపునీరు, మురుగు రోడ్లపైనే నిలువ వుంటుందని సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.



పెద్ద గోనెహాల్‌లో బురదమయం

సమయపాలన పాటించాలి

మద్దికెర, సెప్టెంబరు 12: మండలంలో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి, సేవలు అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో స్వర్ణలత అన్నారు. గురువారం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 1బీ, అడంగల్, కులం, ఆదాయ ధ్రువపత్రాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే డబ్బు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు వెంకటేశ్వర్లు, గోవిందరాజులు, ఆదినారాయణ, ఉపేంద్ర, చంద్ర విష్ణు ఉన్నారు.

చంద్రబాబుతోనే గ్రామాభివృద్ధి



డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్

ఆలూరు రూరల్, సెప్టెంబరు 12: సీఎం చంద్రబాబుతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని సర్పంచి అరుణ దేవి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్ అన్నారు. గురువారం గాంధీ నగర్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆలూరులో ఇంటింటికి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దోమతెరలు వాడండి

మద్దికెర, సెప్టెంబరు 12: దోమతెరలు వాడి, దోమల బారినుండి రక్షించుకోవాలని వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. గురువారం బురుజుల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలపి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, కార్యదర్శి హరికృష్ణ, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆదర్శంగా నిలిచిన ఎమ్మెల్యే కేఈ



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆదర్శంగా నిలిచారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి వివరించామని అన్నారు. స్పందించిన సీఎం చంద్రబాబు కష్టపడిన వారందరికీ గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారనని తెలిపారు.

వర్మీ కంపోస్టుతో ఆదాయం పెంచుకోవాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 12: వర్మీ కంపోస్టు తయారీతో పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలని ఆదోని డీఎల్‌పీవో నూర్జహాన్ ఆదేశించారు. గురువారం ఆమె గోనెగండ్లలోని వర్మీకంపోస్టు కేంద్రాన్ని పరిశీలించారు. అక్టోబరు 2వ తేదీ నుంచి ప్రతి రోజు తప్పక వర్మికంపోస్టు తయారు చేయాలని అన్నారు. తాగునీటి, వీధిదీపాల సమస్య లేకుండా చుసుకోవాలని కోరారు. సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, మలాంగ్, సుబాన్, అనిల్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి, సెప్టెంబరు 12: మండలంలోని దేవరబెట్ట క్రాస్ వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్‌బాబు గురువారం తెలిపారు. వివరాల మేరకు.. కోసిగికి చెందిన కంపాటి మధు, బుగేని రవి పల్సర్ బైక్‌పై 768 డిప్స్ టెట్రా ప్యాకెట్లు తరలిస్తున్నట్లు సమాచారంతో బైక్‌ను సీజ్‌చేసి, ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. నాగరాజు, మధుసూదన్ ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 12: ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఉద్యానవనశాఖ అధికారి శ్రీవాణి సూచించారు. గురువారం హెచ్‌కైరవాడిలో రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తుందని తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

ఆస్పరి, సెప్టెంబరు 12: ఆత్మహత్యాయత్నం చేసిన రైతు మని సుంకన్న (38) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వివరాల మేరకు.. గత నెల 27న సుంకన్న ఆత్మహత్యాయత్నం చేశాడు. బంధువులు కర్నూలుకు తరలించగా గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య లలితమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ తగదు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 12: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడం తగదని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనీఫ్ అన్నారు. గురువారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు పోరాటంలో అనేకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. కేంద్రం విశాఖ పరిశ్రమను ప్రైవేటీకరణ చేయాలని చూడడం సమంజసం కాదన్నారు. యేసేపు, రవి, నవీన్, ఠాగూర్, అజయ్, కృష్ణ, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

తుగ్గలి, సెప్టెంబరు 12: పంటల నమోదు చేయించుకున్న రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో పవన్ కుమార్ అన్నారు. గురువారం కార్యాలయంలో పంట నమోదు చేసుకున్న రైతులతో వేలిముద్ర వేయించి ఈకేవైసీ చేయించారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే ఇది తప్పనిసరని అన్నారు. ఏఈవోలు బాలసరస్వతి, ఎంపీఈవోలు స్రవంతి, లోహిత్, తదితరులు ఉన్నారు.

జంబో షెడ్ పనులు పూర్తి చేస్తాం

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 12 : పత్తి మార్కెట్‌లోని జంబోషెడ్ పనులు త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మాట్లాడుతూ కమీషన్ ఏజెంట్లు, రైతులు అసంతృప్తిగా ఉన్న షెడ్డు పైకప్పు పనులు పూర్తి చేయాలని కోరారన్నారు. వర్షం వస్తే పత్తి దిగుబడులు తడిసిపోతున్నాయని, అనివార్య కారణాలవల్ల కాంట్రాక్టర్ పనులు ఆపేశారని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగం టెండర్ ద్వారా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

జనావాసాలనుంచి యంత్రాలను తొలగించాలి

పత్తికొండ, సెప్టెంబరు 12: పట్టణంలోని సవారమ్మ కాలనీలో అధిక శబ్దం చేసే యంత్రాలను జనావాసాల నుంచి తొలగించాలని స్థానికులు కోరారు. స్థానికులు లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో గురువారం జిల్లా కాలుష్యనియంత్రణ అధికారలు విచారణ చేశారు. ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించారు. శబ్ద కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామని, భూ ప్రకంపణలు వస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆర్‌వో గణేష్‌కుమార్, డీఎల్‌పీవో ప్రకాష్ నాయుడు, సిబ్బంది రవికుమార్ సమ్మెటయంత్రం దుకాణాన్ని పరిశీలించారు. నివేదికలు జిల్లా అధికారులకు పంపుతామని డీఎల్‌పీవో ప్రకాష్‌నాయుడు తెలిపారు.



విచారణ చేస్తున్న అధికారులు

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 12: వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి డిమాండ్ చేశారు. గురువారం స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది కురిసిన వర్షాలకు వేరుశనగ, పత్తి నీట మునిగి రైతులకు తీరని నష్టం వాటిల్లిందని, అధికారులు పంటనష్టం అంచనావేసి పరిహారం అందేలాచూడాలని కోరారు. ఎంపీపీ నారాయణదాసు, నాగరాజు, బాబుల్ రెడ్డి, శ్రీరంగడు, సర్పంచ్ కేశవరెడ్డి, ఉమాకాంతరెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

భక్తులకు శాశ్వత తాగునీటి సౌకర్యం



మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, సెప్టెంబరు 12: భక్తులకు శాశ్వత తాగునీటి సౌకర్యానికి ఉద్దేశించిన మినరల్ వాటర్ ప్లాంటును పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు గురువారం ప్రారంభించారు. రూ.50 లక్షలతో వంద గదుల సముదాయం, అన్నపూర్ణ, బృందావనం గెస్టు హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మూడు కేంద్రాలను పీఠాధిపతి ప్రారంభించారు. దివీస్ ల్యాబొరేటరీస్ ఆర్వో ప్లాంట్ల నగేష్ అండ్ శ్రీనివాసులు దాతల ఆధ్వర్యంలో పూజలు చేసి శుద్ధజలాన్ని భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ మంత్రాలయంలో భక్తులకు శాశ్వత పరిష్కారంగా తాగునీటిని ఏర్పాటు చేశామన్నారు. దాతలకు శేష వస్త్రం, ఫల పుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ ప్రారంభోత్సవంలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనందతీర్థాచార్, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరం



ఆలూరులో ఏచూరికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆలూరు రూరల్, సెప్టెంబరు 12 : ఒక మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరంగా ఉందని ఆలూరు సీపీఎం సీనియర్ నాయకులు కేపీ నారాయణస్వామి, మండల కార్యదర్శి షాకీర్ అన్నారు. గురువారం రాత్రి అంబేద్కర్ సర్కిల్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి క్రొవొత్తులతో నివాళి అర్పించారు. ఈశ్వర్ గౌడ్, దాదా భాషా, శేఖున్ బీ, కృష్ణ, షైన, గోవర్ధన్, రత్నమ్మ, భారతి, నాగరాజు, వీరేశ్ విఠల్, గౌసియ బీ, గిరిమూర్తి, అకిరానంద పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: సీతారాం ఏచూరికి సీపీఎం నాయకులు, కార్యకర్తలు స్థానిక నాలుగు స్థంభాల కూడలిలో నివాళి అర్పించారు. రంగారెడ్డి, వీరశేఖర్, దస్తగిరి, వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు రామనాయుడు పాల్గొన్నారు. సీతారాం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని సీపీఐ కార్యదర్శి రాజాసాహేబ్ గురువారం ప్రగాఢ సంతాపం తెలిపారు. సీతారాం ఏచూరి మరణం పట్ల ఆయన మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉద్యమ నేతను కోల్పోవడం బాధాకరమని తెలుగునాడు టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ అన్నారు.

దేవనకొండ: కమ్యూనిష్టులు ఆరుణ తారని కోల్పోయారని సీపీఐ నాయకులు మద్దిలేటి శెట్టి ,మండల కార్యదర్శి నర్సారావ్ అన్నారు. సీతారాం ఏచూరి ఆకాల మరణం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు.

వీఆర్వోను సస్పెండ్ చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 12: నందవరం మండలం పెద్దకొత్తపల్లి గ్రామంలో రైతుల భూములను తారుమారు చేసిన వీఆర్వో రమేష్‌ను సస్పెండ్ చేయాలని సీపీఐ కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ రంగన్న డిమాండ్ చేశారు. గురువాం రైతులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్న పేదల భూములను కాసులకు కక్కుర్తి పడి ఇతరులకు పట్టాదారు పాసుపుస్తకాలు చేశారన్నారు. కొత్త పాసుబుక్ ఆర్‌వోఆర్ అడంగల్ ఎల్‌పీ నెంబర్ వచ్చిన తర్వాత కూడా రైతుల భూములను ఆ గ్రామంలో వీఆర్‌వోకు కొంత సొమ్మును అప్పజెప్తే అన్లైన్‌లో ఇతరుల పేరులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో 70 మంది బాధితులు ఉన్నారని వీఆర్‌వో రమేష్‌పై సమగ్ర విచారణ జరిపి తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సుదర్శన్, కల్లుబావి రాజు బాధితులు వెంకటేశ్వర్లు రాఘవరెడ్డి, మల్లేష్, నగేష్, వీరేష్, సరోజమ్మ, ఉరుకుంద విజయ్, రవి, లక్ష్మీనారాయణ, పుష్పరాజు ఈరన్న గౌడ్, రామన్న గౌడ్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలి

తప్పుడు కులధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసిన కౌతలం రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎరుకుల రవికుమార్ కోరారు. గురువారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వాటర్ షెడ్ కమిటీ ఎంపికలో ఘర్షణ

ఆదోని, సెప్టెంబరు 12: మండలంలోని పెద్ద హరివాణం వాటర్ షెడ్ కమిటీ ఎంపికలో ఘర్షణ చోటుచేసుకుంది. గురువారం పీవో వలిబేగ్‌తో పాటు ఇతర అధికారులు గ్రామంలో వాటర్‌షెడ్ కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకునేందుకు గ్రామసభ ఏర్పాటు చేశారు. అయితే అక్కడున్న టీడీపీ నాయకులు ఎవరిని అడిగి గ్రామసభ నిర్వహిస్తున్నారంటూ నిలదీశారు. దీంతో బీజేపీ టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. స్పందించిన అధికారులు ఎమ్మెల్యే పార్థసారథి పదిమంది పేర్లు ఇచ్చారని తెలిపారు. ఆయన ఛైర్మన్ పేరు ఎంపిక చేయడంపై స్థానిక టీడీపీ నాయకులు దేవేంద్రప్ప, బసవరాజు, నాగరాజులు అభ్యంతరం తెలిపారు. ఐదేళ్లగా వైసీపీ నాయకులు పెట్టిన ఇబ్బందులన్నీ భరించామని బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి గెలుపు కోసం కృషి చేశామని అన్నారు. ఇటీవల వైసీపీ నుంచి బీజేపీలోకి చేరిన వారిని ఎంపికచేయడంపై టీడీపీ నాయకులు అభ్యంతరం తెలపడడంతో గ్రామసభ నిర్వహించలేక అధికారులు రద్దుచేసి వెళ్లిపోయారు.

బాధితులకు నాయకుల విరాళాలు

ఆదోని నుంచి వెయ్యి కిట్లు పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న ఉమాపతినాయుడు

ఆదోని, సెప్టెంబరు 12: ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సూచన మేరకు టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు, ఎంపీ కేసీనేని చిన్ని, మంత్రులతో కలిసి ఆదోని నియోజకవర్గం తరపున 1000 నిత్యవసర కిట్లు పంపిణీ చేశారు. విజయవాడలోని 54వ వార్డు, ఊర్మిళ నగర్, గొల్లపూడి వీధి, భోజీనగర్, భవానిపురం పంపిణీ చేసినట్లు ఉమాపతి నాయుడు తెలిపారు.

రూ.5లక్షలు విరాళం



లోకేశ్‌తో నాగరాజు

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన కర్నూలు రక్ష హాస్పిటల్ ఎండీ కురువ నాగరాజు విజయవాడ వరద బాదితుల కోసం రూ.5 లక్షల విరాళాన్ని మంత్రి లోకేశ్‌కు విజయవాడలో గురువారం అందజేశారు. అనంతరం స్థానికులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

పెద్దకడుబూరు: రాష్ట్ర టీడీపీ రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి రూ 20వేల నగదు, జాలవాడి ముక్కన్న, కంబగిరి, శ్రీనివాసులు, ముక్కరన్న, చిన్నన్న రూ 17వేల నగదు, చిన్నకడబూరు టీడీపీ నాయకుడు రూ 5వేల నగదు, మురవణి సత్యన్న గౌడ్ రూ. 5వేల నగదు అందజేశారు. చిన్నతుంబళం గ్రామంలో టీడీపీ నాయకుడు వీరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు.



మంత్రాలయంలో విరాళాలు సేకరిస్తూ..

మంత్రాలయం: టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో వరద రాజులు, అశోక్ రెడ్డి విరాళాలు సేకరించారు. ఎంపీటీసీ నక్కి వెంకటేశ్, మేకల నరసింహులు, శివ, బీటీసీ చిన్న, రాఘవేంద్ర, డేవిడ్, ఈరన్న, హనుమప్పలు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 12: ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వరదలను కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నాయకులు వరద బాదితుల కోసం సేకరించిన నిత్యావసర సరుకులు నూతన వస్త్రాలను వాహనంలో విజయవాడకు పంపారు. సీపీఐ ఆధ్వర్యంలో రూ.20వేల విలువ చేసే నిత్యావసర సరుకులు, రూ.50వేలు విలువ చేసే నూతన దుస్తులను బాదితులకు పంపామన్నారు. జిల్లా మాజీ కార్యదర్శి భీమ లింగప్ప, కార్యవర్గ సభ్యులు నబీరసూల్, మండల కార్యదర్శి రాజాసాహేబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, గురుదాస్, వెంకట్రామిరెడ్డి, కారన్న, నెట్టికంటయ్య పాల్గొన్నారు.

వెల్దుర్తి: పద్మవిద్యావికాస్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.20వేలను ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేసినట్లు హెచ్‌ఎం బడేసాహెబ్ గురువారం తెలిపారు.

ఆలూరు నియోజకవర్గంపై దృష్టి సారించాలి

ఆలూరు, సెప్టెంబరు 12: వెనుకబడిన ఆలూరు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి మంత్రి టీజీ భరత్‌ను కోరారు గురువారం మంగళగిరిలో మంత్రిని మర్యాదపూర్వకంగాకలిశారు. పెండింగ్ ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, జాతీయ రహదారి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని కోరినట్లు తెలిపారు.



మంత్రి భరత్‌తో వైకుంఠం దంపతులు

బీజేపీకి పతనం తప్పదు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 12: వక్ఫ్‌బోర్డు భూముల జోలికి వస్తే బీజేపీకి పతనం తప్పదని ఇన్సాఫ్ కమిటీ పట్టణ గౌరవ అధ్యక్షులు, అధ్యక్షులు కేసీ జబ్బార్, సమీఉల్లా హెచ్చరించారు. గురువారం సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షల ఎకరాల భూములున్న మూడవ అతిపెద్ద సంస్థ వక్ఫ్ బోర్డు అన్నారు. ఖాజా, ఇస్మాయిల్, అజారుద్దీన్, సమీర్, నబి సాబ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

ఆస్పరి, సెప్టెంబరు 12 : మండలంలోని చిగిలి గ్రామ సర్పంచ్ రాధాక్రిష్ణ తండ్రి తిప్పన్న అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి నివాళి అర్పించారు. రాధాక్రిష్ణ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబాన్ని ఓదార్చారు. మాజీ మండల కన్వీనర్ సుంకర రామంజినేయులు, కన్వీనర్ పెద్దయ్య, ఎంపీటీసీ తిమ్మప్ప, వైసీపీ కార్యకర్తలు పాలుగొన్నారు..

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 12: విజయవాడ వరద ప్రాంతాలను శుభ్రం చేసేందుకు వెళ్లిన 91 మంది కార్మికులను గురువారం జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, బీజేపీ నాయకుడు ప్రకాష్ జైన్, సీపీఐ నాయకుడు కల్లుబావి రాజు సన్మానించారు.

టీడీపీతోనే గిరిజనుల అభివృద్ధి

తుగ్గలి, సెప్టెంబరు 12: రాష్ట్రంలో ఉన్న గిరిజనుల అభివృద్ధి టీడీపీతోనే జరుగుతుందని, ప్రతి ఒక్కరికి అన్ని సంక్షేమ పథకాలు అందుతాయనీ టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి అన్నారు. గురువారం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గిరిజనులను నట్టేట ముంచిందన్నారు. గిరిజనులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు అందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రాము నాయక్, తిరుపాలు నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రైవేటీకరణపై పోరాడుతాం

మంత్రాలయం, సెప్టెంబరు 12: విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా, తాలుకా అధ్యక్షులు వీరేష్ కోరారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సహాయ కార్యదర్శి థామస్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యతిరేక విధానాల పట్ల ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని అన్నారు. . ప్రతి ఏడాది 2 కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ హామీలను గాలికి వదిలేశారని తెలిపారు. పెండింగ్ మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాముడు, వినోద్, గోపాల్, నవీన్, శైలజ, మైథిలి, రేణుక పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 12 : మండలంలోని మాధవరం గ్రామం నుండి రాయచూర్‌కు వెళ్ళు రోడ్డులో మాధవరం చెక్ పోస్టు వద్ద అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నరు. ఎమ్మిగనూరు సెబ్ సి ఐ భార్గవ్‌రెడ్డి తెలిపిన వివరాలు మేరకు.. కర్ణాటక నుంచి మద్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. పెద్దకడుబూరు మండలం నాగలాపురం గ్రామానికి చెందిన చాకలి గంగాధర్, మంత్రాలయం మండలం పరుమాన్ దొడ్డి తండాకు చెందిన సుగా లి రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 2880 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్ల మద్యం, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ మద్యం విలువ రూ4లక్షలు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ, హెచ్‌సి లింగప్రసాద్, భరత్, నరసింహరెడ్డి మరియు రాధమ్మ పాల్గొన్నారు.

ఖో-ఖో విజేత కందుకూరు బాలికల జట్టు

కోసిగి, సెప్టెంబరు 12: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలికల అండర్-14, 17 క్రీడలను జడ్పీహెచ్ పాఠశాలలో పీఈటీలు ఖలీల్ అహ్మద్, రాజారాం గురువారం ప్రారంభించారు. అండర్-17 ఖో-ఖో విభాగం నుంచి కోసిగి బాలికల ఉన్నత పాఠశాల, కందుకూరు పాఠశాల జట్లు పోటీ పడగా.. ఫైనల్‌లో కందుకూరు జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన జట్టుకు మెమెంటోను అందజేశారు. అండర్-14 వాలీబాల్‌లో కోసిగి బాలికల జట్టు, కబడ్డీలో డి.బెళగల్ జట్టు విజయం సాధించగా.. రన్నర్స్‌గా చిన్నభోంపల్లి నిలిచింది. నాగేంద్రమ్మ, వెంకటేశ్, రామచంద్ర, శివ, గంగాధర్, వీరేష్, శేఖర్, బసవ పాల్గొన్నారు.



ఖో-ఖో ఫైనల్‌లో విజయం సాధించిన కందుకూరు బాలికల జట్టు